# అపురూపమైన కోరిక

## తిరుమలశ్రీ



అనూష ఓ ప్రముఖ సినీతార.

అఖిలాంధ్రకోటి ఆరాధ్య దేవత... అభిమాన నటి. పుష్కరకాలంగా చిత్రరంగాన్ని ఏకఛత్రాధిపత్యంగా ఏలుతున్న పాపులర్ హీరోయిన్.

యువకులనూ, వయోవృద్ధులనూ ఒకే రీతిలో వెక్కిరిస్తున్న గ్లామర్ తార.

అందము, ఆకర్షణ... సొగసు, సౌందర్యమూ - అన్నీ సమపాళ్లలో మేళవించి, విధాత చందనపు చెక్కతో బొమ్మను చేసి వెన్నెలపూత పూసినట్లుంటుంది ఆమె రూపం.

తన సహజమైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుని 'సహజనటి' అన్న బిరుదు పొందింది అనూష. తన నటనలో ఎన్నో అవార్డులు అందుకుంది.

అనూషకు పేరు ప్రఖ్యాతులతోపాటు సంపాదనకు, సౌకర్యాలకు లోటు లేదు. ఆమె పెదవి విప్పాలేగాని తీరని కోరికంటూ లేదు.

సినీ ఫీల్డులో ఆమె పట్ల భయమూ, భక్తీ రెండూ ఉన్నాయి. ముఖ్యంగా దర్శక, నిర్మాతలకు ఆమె నటించిన చిత్రాలకు మినిమమ్ గ్యారంటీ ఉంటుంది. అందుకే ఆమె కాల్షీట్లకోసం నిర్మాతలు పడిగాపులు పడుతుంటారు. ఇక దర్శకులకు అనూషతో ఫిల్మ్ చేయడం ఓ పెద్ద ఘనత అదృష్టమూను!

అటువంటి ప్రముఖ సినీతారకు... గ్లామర్ క్వీన్‌కి... ఆంధ్రుల అభిమాన తారకు... కనుసన్నలతోనే చిత్రరంగాన్ని శాసించగల స్థానాన్ని అధిష్ఠించిన ఆ నాయకీమణికి బహుకాలంగా తీరని కోరిక ఒకటి మిగిలిపోయింది!!

అసలు అనూష పూర్వాశ్రమంలో అనసూయ. పేదరికంలో పుట్టి, పేదరికంలో పెరిగిన పిల్ల. హఠాత్తుగా అదృష్టదేవత ఆలింగనం చేసుకున్న కారణంగా అనసూయ అనూష అయిపోయింది. హీరోయిన్‌గా వెండి తెరమీద వెలసింది. పేదరికపు లోగిలిలోంచి పట్నంలోని పెద్ద లొకాలిటీలోకి లాంగ్ జంప్ చేసింది.

అవకాశం నిచ్చెనకాగా ఆమెలో లేటెంటుగా ఉన్న టాలెంటు విజృంభించింది. నటనగా నాట్యం చేసింది. ఆమె మొదటి చిత్రమే సూపర్‌హిట్ కావడంతో మరి తిరిగి చూసుకోవలసిన అవసరం లేకుండా



## భయం... భయం...

"ప్రేమ సన్నివేశాల్ని స్క్రీన్ మీద చూస్తున్నప్పుడు ఓస్ ఇంతేనా? అనిపిస్తుంది. కాని నేను మొట్ట మొదట అమృతారావ్‌తో రొమేన్స్ సీన్సు చేస్తున్నప్పుడు చాలా నెర్వెస్‌గా ఫీలయ్యాను. ఆమెను కౌగిలించుకున్నపుడు రాపిడికి ఒళ్ళంతా కంపరం పుట్టింది. వెన్నులోంచి వణుకు పుట్టింది." (ప్రేమంటే ఇంతేరా పిచ్చివాడా అని అందుకే అన్నారు)

పోయింది. అనతికాలంలోనే ఆంధ్రుల అభిమాన తార అయిపోయింది. "రాగ్స్ - టు - రిచెస్' సీరీస్‌లో తానూ స్థానం పంచుకుంది.

ఊహ తెలిసినప్పట్నుంచీ తీర్చుకోలేకపోయిన కోర్కెలెన్నో తీర్చుకోగలిగింది. ఇప్పుడామెకు జీవితంలో ఏ లోటూ లేదు. ఏ వెలితీ లేదు.

నిజానికి 'సంపద' ఓ స్థాయికి చేరాక అటుపైన దానికి విలువ ఉండదు. ఆపైన ఎంత సంపాదించినా కేవలం రాశిని పెంచడమే తప్ప, వాసిని కోల్పోతుంది. ఇది నిఖార్సయిన ఆర్థిక సూత్రం. ప్రస్తుతం అనూష స్థితీ అదే!

అయితే-

కొంతకాలంగా 'ఆ' ఒకే ఒక కోరిక ఆమెను తరుముతోంది. ఎక్కడికి వెళ్లినా, ఏ పని చేస్తూ ఉన్నా ఆమె మదిని తొలచివేస్తోంది, కలచివేస్తోంది.

కాని- ఆ కోర్కెను వెల్లడిచేయడానికి బిడియంగా, మొహమాటంగా ఉంది ఆమెకు. ఎగతాళికి గురి అవుతానేమోనన్న భయం కూడా ఉంది. అందుకే ఆ 'కోర్కె'ను బహిర్గతం చేయాలన్న బలమైన కోర్కెను ఎప్పటికప్పుడు తనలోనే అణచివేసుకుంటోంది. వాయిదా వేస్తూ వస్తోంది.

కాలం గడిచేకొద్దీ విజృంభిస్తోన్న ఆ కోరికకు కళ్లాలు వేసి మనసుకు గొళ్లెం పెట్టడం ఇక ఆమె వల్ల కావడం లేదు. అందుకే దానినిప్పుడు వెల్లడి చేయడానికే నిశ్చయించుకుంది అనూష.

"నా కోరిక విని నవ్విపోదురుగాక - అందువల్ల నాకొచ్చే నష్టమేముంటుంది!?" అనుకుంది.

ఆ రోజు - ఓ నూతన చలనచిత్రం ప్రారంభోత్సవం... తొలిషాటు అనూష మీదే తీయబడుతుంది. చిత్రపరిశ్రమకు చెందిన ప్రముఖులతో, ఆప్తులతో, నటీనటులతో, సాంకేతిక నిపుణులతో సెట్టంతా సందడిగా ఉంది.

అనూష మదిలో టెన్షన్‌గా ఉంది.

తన కోరికను వెల్లడిచేసే తరుణం అదేనని ఆమె మనసు నొక్కివక్కాణిస్తోంది. ఎంత కాదనుకున్నా సిగ్గు, బిడియము అడ్డువస్తున్నాయి.

కాని, ఆ అవకాశం వదులుకుంటే తన కోరిక తీరే చాన్సు అంతలో రాకపోవచ్చును.

తెగింపు వచ్చేసింది ఆమెలో.

మొదటి షాట్‌కి ముహూర్తం సమీపిస్తోందనగా డైరెక్టర్‌కి అర్జంటు సమన్ పంపించింది అనూష. అతనితోపాటే ప్రొడ్యూసరు పరుగెత్తుకొచ్చాడు. ఆమె వద్దకు ఏం ఉపద్రవం ముంచుకొచ్చిందో నన్న భయంతో.

తన మదిలోని కోర్కెను ఎలా చెప్పాలో తెలీక రెండు నిముషాలు మౌనంగా ఉండిపోయిందామె.

ముహూర్తానికి వేళవుతోందన్న టెన్షన్‌తో ఊపిరి ఆడడంలేదు ప్రొడ్యూసర్‌కి.

కోయిల, కంఠం విప్పింది చివరికి ఎలాగో "చాలాకాలంగా నాలో బలీయమైన కోరిక ఒకటి పాతుకుపోయి ఉంది. దానిని తీర్చవలసిన బాధ్యత మీమీద పెడుతున్నాను. అంతవరకు షూటింగులో పాల్గొనేది లేదు నేను" అందామె.

ఆమె పలుకులు వింటూనే, ప్రొడ్యూసర్ గుండె ఓ బీట్‌ని మిస్ చేసింది.

చిత్ర నిర్మాణానికి కొత్తవాడతను. అదే అతని మొదటి చిత్రం. పేరున్న హీరో, హీరోయిన్లు గొంతెమ్మ కోర్కెలతో నిర్మాతలకు నానాతిప్పలూ పెడతారని ఆలకించివున్నాడు. ఇప్పుడు ఆ పాట్లు తనకూ ఆరంభమయ్యాయనుకున్నాడు.

"కొంపదీసి తన బాయ్‌ఫ్రెండ్‌ని తన సరసన హీరోగా బుక్ చేయమని ఆంక్షలు పెట్టదుగదా!" అనుకున్నాడతను.

"ఇప్పటికిప్పుడు రెమ్యూనరేషన్‌ని రెట్టింపు చేయమని మారాం చేయదుగదా ఈవిడ!.... ఇంతవరకు వచ్చాక తాను వెనకడుగువేయలేడు కూడాను" అనుకుని ఆందోళన చెందాడు.

కంగారుగా డైరెక్టర్ ముఖంలోకి చూసాడు ప్రొడ్యూసరు.

డైరెక్టరు అనూష వదనంలోకే చూస్తున్నాడు. ఆమె కోరిక తాలూకు 'క్లూ' అక్కడేమయినా కనిపిస్తుందేమోనని కాబోలు!

నిర్మాత జుట్టు పీక్కోబోయి ఆగిపోయాడు - తనది బట్టతల అని గుర్తుకొచ్చి చేతులు నులుముకున్నాడు.

"మేడమ్! అవతల ముహూర్తపు షాటుకి వేళయిపోతోంది. ముఖ్య అతిథి కూడా సిద్ధంగా ఉన్నారు. అంతా మీకొరకు ఎదురుచూస్తున్నారు. మీ కోరిక ఏమిటో సెలవిస్తే షాట్ పూర్తయ్యేసరికి తీర్చడానికి ప్రయత్నిస్తాను" ఆరాటం అణచుకుంటూ అతి వినయంగా అన్నాడు.

కోట్లు ఖర్చు చేసి చిత్రం తీస్తున్నది తానే అయినా పాపులర్ హీరో, హీరోయిన్ల ముందు నిర్మాత చేతులు కట్టుకుని నిలుచోక తప్పదు మరి!

అప్పుడు మెల్లగా తన 'కోరిక'ను వెల్లడించింది అనూష.

ఆమె కోరికను ఆలకించిన దర్శక, నిర్మాతలు నిర్ఘాంతపోయారు. తేరుకున్నాక ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

ఆ పెద్దమనుషులిద్దరూ నమ్మలేనట్లుగా దిగ్భ్రాంతితో తన వంక చూస్తుంటే బిడియంగా తలవంచుకుంది అనూష.

"ఔనండీ. ఇంతవరకూ సుమారు యాభయ్ చిత్రాలలో నటించాను నేను. అయినా ఆ కోరిక తీరనేలేదు. కనీసం ఈ చిత్రంలోనయినా తీర్చుకోవాలన్న తపన!" అంది నెమ్మదిగా.

"అదే - ఒంటి నిండుగా దుస్తులు ధరించి నటించాలనీ...!!"

❀

## ప్రసన్నం

ప్రీతామీనన్ అదేపనిగా సైఫ్‌ని పొగడ్డం మొదలు పెట్టింది. సైఫ్‌లో మంచి ప్రేమికుడున్నాడంటోంది.

"అతనితో మాట్లాడుతుంటే అమ్మ ఒడిలో సేద తీర్చుకుంటున్న ఫీలింగ్ కలుగుతోంది" అంటోంది.

మగవాళ్ళను బుట్టలో పడేయడానికి ఇంతకంటే వేరే మార్గం లేదేమో!

(నవాబుగార్ని ప్రసన్నం చేసుకోవడం మంచిదనిపించి వుంటుంది.)

